


**యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు.. మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్


Cell:9701249103



సంపుటి - 3 సంచిక -99 శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ఇంధన భద్రతకే ప్రాధాన్యం



**రష్యా నుంచి ఆయిల్ కొనొద్దు..**

**భారత్‌కు అమెరికా అల్టిమేటం..**

**ఘాటుగా స్పందించిన న్యూఢిల్లీ**

**రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును ఆమోదించిన యూఎస్ కాంగ్రెస్**

**100శాతం వరకు టారిఫ్‌లు విధించేలా చట్టంలో నిబంధన**

**తమ ఇంధన భద్రతకే తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసిన భారత్**

**ఈ చర్య ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తుందని యూఎస్‌కు న్యూఢిల్లీ వార్నింగ్**

**ఢిల్లీ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను**మిగతా 2లో...**

# మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి పరుగులు



**వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం చంద్రబాబు**

**దేశాన్ని ప్రగతి దిశగా నడుపుతున్నారు**

**జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు**

**మేకిన్ ఇండియాను బలోపేతం చేశారు**

**నదుల అనుసంధానం ఆయనతోనే సాధ్యం**

**మహిళలకు 33శాతం కోటా.. గేమ్ చేంజర్**

**ఏపీకి కేంద్రం నుంచి పెద్దఎత్తున సహకారం**

**వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం**

**అవి వస్తే ఉపాధి, అభివృద్ధి: చంద్రబాబు**



**అమరావతి/వారాణసీ /సెప్టెంబర్ 1(జర్నలిస్ట్ వార్త):**
'సుస్థిరతతో నమ్మకం పెరుగుతుంది. నమ్మకంతో పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడుల వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి. అభివృద్ధీ జరుగుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీని దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా అభివర్ణించారు. మోదీ పాతికేళ్ల ప్రజాప్రస్థానాన్ని పురస్కరించుకుని గురువారం వారాణసీలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'వారాణసీ-వడ్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు.దేశాన్ని మోదీ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని తన ప్రసంగంలో పిలుపిచ్చారు. కాశీ పుణ్యక్షేత్రం మోదీ కర్మభూమి అని.. వారాణసీకి నేతను ఎన్నుకోవడమే కాదు...దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించిందని తెలిపారు. 'వీకేఎస్ అనేది అభివృద్ధి మంత్రం.**మిగతా 2లో...**

## సెమీకండక్టర్ రంగంలో భారత్ దూకుడు..




**భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది: ప్రధాని మోదీ**

**సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించిన ప్రధాని మోదీ**

**ప్రపంచమంతా భారత చిప్స్ వెళతాయని ధీమా**

**నాలుగేళ్లలోనే 70,000 మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామన్న అశ్విని వైష్ణవ్**

**ఢిల్లీ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి **మిగతా 2లో...**

## 2004 వరకు కేసీఆర్‌కు ఎకరా భూమి లేదు

**నాటి ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనే వెల్లడించారు**

**ఇప్పుడు 440 ఎకరాలు ఎక్కడినుంచి వచ్చాయ్?**

**భూస్వాముల కుటుంబమైతే**

**భూముల వివరాలు ఎందుకు దాచారు?**

**నిలదీసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
తనకు 2004 వరకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని అదే ఏడాది కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ స్వయంగా వెల్లడించారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సున్నా ఎకరాల నుంచి వేల కోట్ల ఆస్తులకు ఎదిగిన **మిగతా 2లో...**


## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

**మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ**

**సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం**

**డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన**




## వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

**పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి**

**అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి**

**సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం**

**రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**



2లో.

## జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

**వచ్చే ఏడాది రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ**

**జనవరి 22 నుంచి తొలి విడత పరీక్షలు**

**ఏప్రిల్ లో సెకండ్ సెషన్ పరీక్షలు**

**అక్టోబర్ 2026లో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు**

**యూజీసీ నెట్, క్యూయెట్ పీజీ తేదీలు కూడా ఖరారు**



2లో.

## మెడికల్ షాపుల్లో సీసీటీవీ నిఘాలోనే మందులు..

**కేంద్రం కొత్త ప్రతిపాదనలు**



2లో.

## రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కీసర సీఐ, ఎస్ఐ

**స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్ చేసిన పోలీసులు**

**గతంలో బిర్యానీలు, కూల్ డ్రింకులు కూడా తెప్పించుకున్నట్లు ఆరోపణలు**

**ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి విచారిస్తున్న ఏసీబీ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో ఇద్దరు పోలీసు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్**మిగతా 2లో...**

## డీజే వాహనాలను అడ్డుకోవద్దు

**వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతులు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి**

**ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని హోంమంత్రి, డీజీపీని కోరిన మంత్రి**



**అమరావతి, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి డీజే వాహనాల అనుమతులపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉత్సవాల సందర్భంగా డీజే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని ఆయన హోంమంత్రి అనిత, డీజీపీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన **మిగతా 2లో...**

# నిరూపిస్తే రాసిస్తాం

## రేవంత్‌కు కేటీఆర్ ఛాలెంజ్

**933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తాం..**

**సిట్టింగ్ జడ్జితో విచారణకు కేటీఆర్ సవాల్**

**కేసీఆర్ ఆస్తులపై ఆరోపణలను ఖండించిన కేటీఆర్**

**67 ఎకరాల భూమిపై కేటీఆర్ వివరణ**

**రేవంత్ ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు**



**హైదరాబాద్ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు.గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను**మిగతా 2లో...**

# ఇంధన భద్రతకే ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

సంతరించుకుంది.
అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. "భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు.

**ఏమిటీ కొత్త చట్టం?**

'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ)పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి.
అయితే, రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ, వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.

**గట్టిగా బదులిచ్చిన భారత్**

అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది. ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని" కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టం వల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.
తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది.

# సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

మొదటిపేజీ తరువాయి

కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమీకాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు-ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85,000 మంది డిజైన్ ఇంజనీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70,000 మందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# మెడికల్ షాపుల్లో సీసీటీవీ నిఘాలోనే మందులు.

## - కేంద్రం కొత్త ప్రతిపాదనలు

**ఢిల్లీ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
డాక్టర్ల సిఫార్సుతో విక్రయించే మందులపై కేంద్రం మరింత కఠిన నిఘాకు సిద్ధమవుతోంది. మందుల దుకాణాలు, ఇతర లైసెన్స్ పొందిన రిటైల్ కేంద్రాల్లో ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు విక్రయించే సమయంలో సీసీ కెమెరా నిఘా తప్పనిసరి చేసే ప్రతిపాదనను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీసుకొచ్చింది.
సెప్టెంబర్ 8న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం.. రిజిస్టర్డ్ వైద్యుడు సూచించిన ఏదైనా మందును హోల్‌సేల్ విక్రయాలు మినహా ఇతర మార్గాల్లో సరఫరా చేసే సమయంలో లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సీసీటీవీ వ్యవస్థ పనిచేస్తూ ఉండాలి. మందు విక్రయం జరిగిందని ధ్రువీకరించుకునేలా రికార్డింగ్ ఉండాలి. ఈ దృశ్యాలను కనీసం మూడు నెలల పాటు భద్రపరచాలని ప్రతిపాదించారు.
ప్రిస్క్రిప్షన్ అవసరమైన మందులను కొన్ని చోట్ల సరైన వైద్య సూచన లేకుండానే విక్రయిస్తున్నారన్న ఆందోళనల నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. మందుల విక్రయంలో బాధ్యతను పెంచడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో అధికారులు తనిఖీ చేసేందుకు ఈ రికార్డులు ఉపయోగపడే అవకాశం ఉంది.
ఈ నిబంధన షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ మందులకే పరిమితం కాదు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌తో సరఫరా చేసే మందులన్నింటికీ వర్తించేలా ముసాయిదాలో పేర్కొన్నారు. అయితే హోల్‌సేల్ వ్యాపారులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది.
ఇటీవల దగ్గు సిరప్‌ల విక్రయాలపై నిబంధనలు కఠినతరం చేసిన నేపథ్యంలో తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా పిల్లలు, పెద్దలకు ఉద్దేశించిన కొన్ని మందులు సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఇవ్వడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వయసు, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా మందు, మోతాదు నిర్ణయించాల్సిన అవసరం ఉండటంతో ఈ అంశంపై కేంద్రం దృష్టి సారించింది. అయితే సీసీటీవీ నిబంధన ఇంకా అమల్లోకి రాలేదు. ఇది కేవలం ముసాయిదా మాత్రమే. ప్రతిపాదనపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన తర్వాత కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. గెజిట్‌లో తుది నిబంధనలు ప్రచురించినప్పుడు ప్రభుత్వం పేర్కొనే తేదీ నుంచి మాత్రమే కొత్త నిబంధన అమల్లోకి వస్తుంది.

# రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కీసర సీఐ, ఎస్ఐ

మొదటిపేజీ తరువాయి

స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, స్వీకరించిన కేసులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్/ఎస్‌హెచ్‌ఓ అర్కపల్లి ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్ ద్యాప జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు.
ఒక కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు బాధితుడిని, అతని స్నేహితుడిని ఇకపై వేధించకుండా ఉండేందుకు ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తమ ప్రకటనలో వెల్లడించింది. పోలీసుల వేధింపులు ఎక్కువవడంతో బాధితుడు నేరుగా ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా రూ.10 లక్షలు డిమాండ్ చేసిన పోలీసులు, చివరికి రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడితో గత కొన్ని రోజులుగా నిందితులు బిర్యానీలు, కూల్ డ్రింకులు తెప్పించుకుని వేధించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.
బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో గణేష్ నిమజ్జన డ్యూటీలో ఉన్న ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి, కీసర చెరువు సమీపంలో ఒక కారులో రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సూచన మేరకే ఎస్ఐ ఈ డబ్బును స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ అధికారులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, ఎస్ఐని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ అనంతరం ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ ఇద్దరినీ అరెస్ట్ చేసిన ఏసీబీ, వారిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కీసర పోలీస్ స్టేషన్‌తో పాటు అధికారుల నివాసాల్లోనూ ఏసీబీ సోదాలు నిర్వహించింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్-ఫ్రీ నంబర్ 1064కు సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ ప్రజలకు సూచించింది.

# మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి పరుగులు

మొదటిపేజీ తరువాయి

ఈ మంత్రంతో దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది.
వీ అంటే వడ్‌నగర్.. కే అంటే కాశీ.. ఎస్ అంటే సెప్టెంబరు' అని చెప్పారు. ఎన్డీఏ ఐక్యతే దేశానికి బలమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం పెద్దఎత్తున సాయం అందిస్తోందన్నారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు ఇస్తున్న మద్దతును రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువలేరని తెలిపారు. దేశంలో భిన్న సంస్కృతులు, భిన్న భాషలు ఉన్నా.. దేశాభివృద్ధి, ఆత్మనిర్భరతే మన లక్ష్యమన్నారు. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. మోదీ ప్రభుత్వ విజయాలను చంద్రబాబు వివరించారు. 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని.. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయని చెప్పారు. 'జల్‌జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇవి అంకెలు మాత్రమే కాదు.. వీటి వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఎలాంటి మధ్యవర్తులూ లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగదు జమ చేస్తున్నారు' అని తెలిపారు. ప్రపంచంలో వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారని.. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ విధానాలతో మేకిన్ ఇండియా కాన్ఫిడెన్స్‌ను బలోపేతం చేశారని ప్రశంసించారు. 'గతంలో రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీయే. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ఆయన కృషి అపూర్వం.. బేటీ బచావో-బేటీ పడావో, లఖ్‌పతి దీదీ స్కీంలు ఇందుకు నిదర్శనం. ఉజ్వల పథకం ద్వారా క్లీన్ ఫ్యూయల్‌ను ప్రోత్సహిస్తున్నారు. ముద్ర పథకం పెట్టుబడులు సమకూరుస్తోంది. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీశక్తి అధినియం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు. ఇది గేమ్ చేంజర్ కాబోతోంది' అని చెప్పారు.
దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత మోదీదేనని సీఎం పేర్కొన్నారు. 'దేశం నలుమూలలకూ కనెక్టివిటీ పెంచారు. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రం పెండింగ్‌లో ఉంది.. ఇది కూడా మోదీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంధానం చేస్తే దేశానికి తిరుగుండదు. మోదీ సారథ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు.. గ్రామీణ ప్రాంతాలకూ చేరింది' అని తెలిపారు. ప్రపంచం ముందు భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలబెట్టిన ఘనత మోదీదేనన్నారు. ఎవరైనా మన దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారని తెలిపారు. 'నేను కూడా నక్సలిజాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు.. కానీ ఇప్పుడు దేశంలో నక్సలిజం, మావోయిజం అనేదే లేకుండా చేశారు. దటీజ్ నరేంద్ర మోదీ.' అని చెప్పారు.

**కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు**



కాశీవిశ్వనాథుడిని చంద్రబాబు దర్శించుకున్నారు. యోగి ఆదిత్యనాథ్, రాజ్‌నాథ్, చిరాగ్ పాసవాన్‌తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథుడిని పవిత్ర జలాలతో అభిషేకించారు. అర్చకులు ఆశీర్వదించి.. తీర్థప్రసాదాలు అందించారు. కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ఆలయ ప్రాంగణంలోని భక్తులకు సీఎం ప్రసాదం పంచారు. ఆయన వెంట ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీశ్ ఉన్నారు.

# నిరూపిస్తే రాసిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఆయన ఖండించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇన్నాళ్లూ ప్రచారం చేసి.. అసెంబ్లీలో మాత్రం 67 ఎకరాలు ఉన్నట్లు సీఎం చెప్పారని కేటీఆర్ అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
కేసీఆర్‌కు 933 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం నిరూపిస్తే ఆ భూములను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పుట్టుపూర్వోత్తరాలతో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారని, తమ తాతకు వందల ఎకరాల భూమి ఉండేదని కేటీఆర్ చెప్పారు. ఇప్పుడు 67 ఎకరాలు ఉండటం తప్పా? అని ప్రశ్నించారు.
ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించుకున్నానని చెబుతున్నా.. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ లాంటి ఇల్లు, ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన తమ్ముళ్లు ఏరోస్పేస్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక ఆయన చిన్నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో వివరించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేతలపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రతి పథకంలోనూ స్కామ్ ఉంటోందని ఆరోపించారు.

# వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

**హైదరాబాద్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ వ్యాప్తంగా 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ' వేడుకలు సెప్టెంబర్ 17న అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ నాంపల్లిలోని చారిత్రాత్మక పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకునే ముందు గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో పోలీసు బలగాల నుంచి రేవంత్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా సీఎం ప్రసంగిస్తూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, స్వేచ్ఛ, సామాజిక న్యాయమే పునాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన 'ప్రజా పాలన'ను అందిస్తోందని స్పష్టం చేశారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

**ఢిల్లీ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ - 2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే ఏడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది.
జేఈఈ మెయిన్ - 2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టీఏ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. జేఈఈ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. దీని ప్రకారం, యూజీసీ నెట్ పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ - 2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

# డీజే వాహనాలను అడ్డుకోవద్దు

మొదటిపేజీ తరువాయి

విడుదల చేశారు. వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని లోకేశ్ తెలిపారు. ప్రజల నుంచి ఈ విషయంపై తనకు అనేక సందేశాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
ఈ నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ వెంటనే జోక్యం చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డీజే వాహనాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సులభతరం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా క్లియరెన్సులు ఇవ్వాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా రాష్ట్రంలో ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని ఆయన స్పష్టంగా సూచించారు. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా పండుగను జరుపుకునే వాతావరణం కల్పించాలని ఆయన పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.

# 2004 వరకు కేసీఆర్‌కు ఎకరా భూమి లేదు

మొదటిపేజీ తరువాయి

భూబకాసురుడు కేసీఆర్ అని గురువారం ఎక్స్ వేదికగా మంత్రి మండిపడ్డారు. ఎకరా భూమి కూడా లేదని తెలిపిన కేసీఆర్‌కు.. ఇప్పుడు 440 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక పదేళ్ల పాలనలో కేసీఆర్ భూములు భారీగా పెరిగాయని 2004 నాటి ఆయన ఎన్నికల అఫిడవిట్ స్పష్టం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబానికి రూ.కోట్ల ఆస్తులు సమకూరితే.. తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలాయన్నారు. ఇవాళ కేసీఆర్ వద్ద రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నాయంటే పేదలు, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లనే సాధ్యమైందని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద రూ.లక్ష కోట్ల ఆస్తులను కల్వకుంట్ల కుటుంబం అక్రమంగా సంపాదించిందన్నారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న కేటీఆర్.. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో వాటిని ఎందుకు చూపలేదు... అంటే ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారా..? ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో, 24 మండలాల్లో, 31 గ్రామాల్లో 440 ఎకరాల భూమి ఉందని, ఇదంతా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం శాసనసభలో ప్రశ్నించారని... ఇదే కాకుండా బినామీల పేరుతోనూ వందల ఎకరాలు దోచుకున్నారని, రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కేటీఆర్, ఆయన భార్య, పిల్లల పేరుతో ఎర్రవల్లి, జన్వాడ, మర్కూక్, వెంకటాపూర్ పరిధిలో 123.19 ఎకరాలు ఉందన్నారు. అయితే 2009 ఎన్నికల సమయంలో కేటీఆర్ ఇచ్చిన అఫిడవిట్‌లో మాత్రం రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట్ మండలం దేవరయాంజల్ సర్వే నంబరు 437లో ఎకరం వ్యవసాయ భూమి మాత్రమే ఉందని, దాని విలువ రూ.50 లక్షలుగా చూపారని మంత్రి తెలిపారు. కాగా కేటీఆర్ భార్య పేరుతో వ్యవసాయేతర భూమి అల్వాల్ పాకల్‌కుంట సర్వే నంబరు 569,676 పరిధిలో 660 గజాలు ఉందని, దాని విలువ రూ.67.20 లక్షలుగా చూపారన్నారు.. మల్కాజ్‌గిరి సర్వే నంబరు 171లో 534 చదరపు గజాల ప్లాట్, దాని విలువ రూ.32.04 లక్షలని, మొయినాబాద్ సర్వే నంబర్లు 94,99,100,101,102 పరిధిలో 400 చదరపు గజాలు ఉందని ఆయన పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

## జాతీయ జెండాకు సెల్యూట్.. ప్రజాపాలనకు గౌరవం

### ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం




**ధర్మసాగర్/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ. శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది జాతీయ జెండాకు సెల్యూట్ చేసి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ స్ఫూర్తిని చాటారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొని జాతీయ సమైక్యత, ప్రజాసేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు.

## చిన్నారి మేఘనకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆశీస్సులు



**కేసముద్రం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీతకుమారస్వామి దంపతుల కుమార్తె మేఘన నూతన వస్త్ర ఫల, పుష్పాలంకరణ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మి సాయి గార్డెన్స్‌లో జరిగిన ఈ శుభకార్యానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి మేఘనను లాలించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, నాయకులు సంకు రమ, వార్దెల్లి సుమలత, సర్పంచ్ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారి మేఘనకు ఆశీస్సులు అందజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నిజమైన ప్రజా పాలన

### తల్లాడ పంచాయతీలో జాతీయ పతాకావిష్కరణ




**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.
ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడమే నిజమైన ప్రజా పాలనకు నిదర్శనమని నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.
కార్యక్రమంలో మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఎంపీవో శ్రీహరికృష్ణ, బీజేపీ నాయకులు పెరిక కిరణ్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ అప్పిరెడ్డి, ఏపీవో కోటయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ గిరిజనుల ఆశాజ్యోతి

### గిరిజన రిజర్వేషన్ల పెంపునకు నాలుగేళ్లు.. సబ్‌స్టేషన్ తండాలో పాలాభిషేకం



**కేసముద్రం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయని మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సబ్‌స్టేషన్ తండాలో కేసీఆర్ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో గిరిజన సంక్షేమానికి రూ. 37 వేల కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. సుమారు ఆరు లక్షల మంది గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందించడంతో పాటు 'మా తండాలో మా పాలన' నినాదంతో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. గిరిజన యువతకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా ఉందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల పెంపునకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా తండాలు, గూడేల్లో గిరిజనులు స్వచ్ఛందంగా కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేసముద్రం మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, తండా ప్రజలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంట నమోదు నిర్లక్ష్యం వద్దు!

### 23లోగా డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలి: డీఏఓ విజయచంద్ర



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** పంటల నమోదు విషయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, రైతులకు అందే ప్రయోజనాలకు పంటల నమోదు కీలకమని పేర్కొన్నారు. ధర్మసాగర్ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈనెల 23వ తేదీలోగా సర్వేను పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వాలంటీర్లు నమోదు చేసిన పంటల వివరాలు రైతుల నమోదిత మొబైల్ నంబర్లకు చేరుతాయని తెలిపారు. రైతులు తమకు సంబంధించిన పంటల వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి సవరణలు చేయించుకోవాలని సూచించారు. నమోదు చేసిన వివరాల్లో పొరపాట్లకు తావివ్వకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**యూరియా కొరత లేదు.. నేరుగా బుక్ చేసుకోండి**

జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని విజయచంద్ర తెలిపారు. ఎఫ్ఎఫ్ఎస్ దరఖాస్తు ద్వారా రైతులు తమకు సమీపంలోని ఎరువుల దుకాణంలో నేరుగా యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేష్, ఏఈఓ దివ్య, సర్వేయర్ వంశీ, రైతులు పాల్గొన్నారు.

# మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

### విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ నాయకులు



**ధర్మసాగర్/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంతానికి 1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించిందన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.
అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద మాజీ మంత్రి గుండె విజయరామారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎస్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయరామారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు 25 మందికి పైగా రక్తదానం చేశారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, సీనియర్ నాయకులు నిమ్మ సుదర్శన్ రెడ్డి, నాగవెల్లి యుగంధర్, పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి, గంకిడి వెంకట్ రెడ్డి, గాజుల సంపత్, దుస్స రాములు, దాసరి సదానందం, మట్టేపెల్లి వెంకటేశ్వర్లు, బాధావత్ కిష్టు నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజా శ్యామ్ సుందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పెసరు వెంకటేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గంగారపు రమేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు భరోసా కల్పించేలా విధులు నిర్వహించాలి

### నూతన ఇన్‌స్పెక్టర్ అనుముల శ్రీనివాస్‌కు ఎమ్మార్పీఎస్ నేతల ఘన సన్మానం



**ధర్మసాగర్/ హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనుముల శ్రీనివాస్‌కు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించి, శాలువా కప్పి అభినందించారు.
ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ మాట్లాడుతూ.. అనుముల శ్రీనివాస్‌కు ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌తో గతంలోనే అనుబంధం ఉందని, ఇదే స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా వ్యవహరించి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గత అనుభవాన్ని మరింత పదునుగా ఉపయోగించి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా, బాధితులకు అండగా నిలిచేలా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ధర్మసాగర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు శాంతి శాంతిసాగర్ మాదిగ, సింగారపు పవన్ మాదిగ, పొడిశెట్టి ప్రతాప్ మాదిగ, నక్క సుమన్ మాదిగ, పొడిశెట్టి సురేంద్ర మాదిగ, రామంచ ఏసు మాదిగ, మేక సృజన్ మాదిగ, సోంపల్లి అన్వేష్ మాదిగ, ఎండీ శంషాద్దీన్, మట్టెడ బాలు, గొల్లపల్లి అనిల్ మాదిగ, పుట్ట ప్రశాంత్ మాదిగ, పుట్ట దేవరాజు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సింగారపు దిలీప్ మాదిగ, సోంపల్లి ప్రవీణ్ మాదిగ, సోంపల్లి రాజేంద్ర మాదిగ, ఇమ్మడి ప్రమోద్ మాదిగ, బొక్క ప్రేమ్, బొడ్డు రాజు, బొడ్డు బన్నీ, నక్క ప్రవీణ్, పోలుమారి విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవం ఘనంగా

### జాతీయ జెండాను ఆవిష్కరించిన చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న



**కేసముద్రం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, త్యాగాలు, ప్రజాస్వామ్య విలువలను స్మరించుకుంటూ ప్రజలకు మెరుగైన పాలన, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వారి కలల తెలంగాణ నిర్మాణానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అల్లం రామ నాగేశ్వరరావు, కమిషనర్ టీ. శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు దారావత్ కిషోర్, వల్లందాస్ ఉమా రవి, బానోత్ విజయ, అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్

### ఉప సర్పంచ్ బోడ శ్రీనివాసరావు




**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల ఆరాధ్య దైవం మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ సాధకుడు కేసీఆర్ అని వెంకన్నపేట గ్రామ ఉప సర్పంచ్ బోడ శ్రీనివాసరావు అన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం వెంకటరాముడుతండాలో కేసీఆర్ చిత్రపటానికి గ్రామస్తులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడ శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ల పెంపు నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గిరిజన నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రను వక్రీకరించొద్దు

## భూమి, భుక్తి, వెట్టి విముక్తి కోసం సాగిన పోరాటం -కేసముద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

**కేసముద్రం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఎం కేసముద్రం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గోడిసెల వెంకన్న మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన చారిత్రాత్మక ప్రజా పోరాటమని అన్నారు. భారతదేశ చరిత్రలో తెలంగాణ రైతాంగ పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ పోరాటంలో వేలాది మంది మహిళలు తీవ్ర చిత్రహింసలకు గురయ్యారని, సుమారు 5 వేల మంది వీరులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, నల్ల నర్సింహులు, టాను నాయక్, షేక్ బంధగీ తదితరుల త్యాగాలు, పోరాటాల




ఫలితంగా లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందని, వేలాది గ్రామాలు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందాయని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనని వెంకన్న అన్నారు. ఇది మతాల మధ్య జరిగిన పోరాటం కాదని, భూస్వాములు, దొరల దోపిడీ, వెట్టిచాకిరీతోపాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా



ఉద్యమమని స్పష్టం చేశారు. ప్రస్తుత పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలపై తెలంగాణ అమరవీరుల స్ఫూర్తితో ప్రజలంతా ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోడెం వెంకన్న, బొబ్బల యాకూబ్‌రెడ్డి, చాగంటి కిషన్, జాల జయరాజ్, శ్రీశైలం, నీరూటి జలంధర్, అల్వాకొండ సావిత్రి, జానుపాటి జ్యోతి, జాటోతు వెంకన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన తల్లాడ బీజేపీ నాయకులు



**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** భారత ప్రధాని నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ 76వ జన్మదిన వేడుకలను తల్లాడ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు చల్లా నాగులు ఆధ్వర్యంలో తల్లాడ పట్టణంలోని శివాలయంలో మోదీ పేరిట ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీ దేశ ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణ పరిధిలోని పలు గణేశ్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులు ప్రధాని మోదీకి ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.

కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రాయల రమేష్, పెరిక కిరణ్, మండల ఉపాధ్యక్షురాలు వేము రజిత, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు శారద, మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ ప్రతినిధులకు ఘన సన్మానం



**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో వినాయక చవితి వేడుకల సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి రియల్ ఎస్టేట్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. నిమ్మగూడెం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వినాయక విగ్రహ దాత ఆనందరావు భద్రాచలం, లక్ష్మీ గణపతి రియల్ ఎస్టేట్ నిర్వాహకులను సత్కరించారు. రియల్ ఎస్టేట్ ప్రతినిధులు పొన్నం కృష్ణయ్య, బోనాసి శ్రీనివాసరావు, షేక్ జానీమియాలకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గోడ్ల ప్రభాకర్‌రావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, 12వ వార్డు సభ్యురాలు పొన్నం పద్మావతి, దొడ్డ నిర్మల, కొమ్మినేని చలపతి, గుమ్మ హరి, గుమ్మ శీను, గుమ్మ నరేష్, గుమ్మ రామకృష్ణ, దిరిశాల సీతారత్నం, దుగ్గినేని వెంకటి, ఆపద రామారావు తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాతలకు కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్వకర్మ జన్మదిన వేడుకలు ఘనంగా



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ కార్యాలయంలో విశ్వకర్మ జన్మదిన మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ అధికారి శ్రీరామోజు లక్ష్మణాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీ కృష్ణాజి రవీంద్రాచార్యులు, ప్రధాన కార్యదర్శి వెళిశోజు బుచ్చిరామాచార్యులు, టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధి సిద్ధోజు లక్ష్మణాచారి, జిల్లాలోని విశ్వకర్మ సంఘాల నాయకులు పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతి ప్రాధాన్యతను పలువురు వివరించారు.

# జాతీయ జెండాను ఎగురవేసిన సర్పంచ్




**తల్లాడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లాడ మండలంలోని గోపాలపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తాళ్ల సుధారాణి జాతీయ జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సుధారాణి మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, రజాకారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమం చరిత్రలో చిరస్మరణీయమన్నారు. భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించి నిజాం పోలీసు, రజాకారుల బలగాలను అణచివేసి హైదరాబాద్‌ను భారతదేశంలో విలీనం చేసిన రోజు సెప్టెంబర్ 17 అని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన ఈ రోజును జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ చెనక్కాయల సత్యనారాయణ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ అగస్టీన్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు యూనిఫాం, బ్యాగుల పంపిణీ






## విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

**కేసముద్రం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మండలం కలవల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, షూలు, టైలు, బెల్టులు, గుర్తింపు కార్డులు, బ్యాగులను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పరిమి నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు.

ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాంలతోపాటు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం, 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ అవార్డు గ్రహీత పార్థసారధిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెదగాని రవి, పంచాయతీ కార్యదర్శి మనోజ్, వార్డు సభ్యులు పిచ్చయ్య, గండు శీను, రామ్మోహన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శిరీష, యాకయ్య, చంద్రశేఖర్, పార్థు, శ్రీదేవి, శ్వేత, నరసయ్య, రేణుకతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హమారాప్రసాద్ పుస్తకాన్ని తక్షణమే నిలిపివేయాలి

**విడుదల కాకముందే చర్యలు తీసుకోవాలి**

**చట్టపరంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోండి**

**అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్**

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
హమారా ప్రసాద్ రచించిన 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పుస్తకంలోని అంశాలు అంబేద్కర్ అభిమానులు, దళిత సమాజం మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని సంఘం నాయకులు ఆరోపించారు. పుస్తకాన్ని విడుదలకు అనుమతించకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు మాట్లాడుతూ.. అభ్యంతరకరమైన అంశాలతో పుస్తకాన్ని ప్రచురించినట్లయితే సామాజికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని తెలిపారు. పుస్తకంలోని విషయాలను సంబంధిత అధికారులు పరిశీలించి, చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు మాట్లాడుతూ.. అమర ప్రసాద్ రచించిన పుస్తకం



విడుదలను నిలిపివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్, దళిత సమాజంపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చొరవ చూపాలని కోరారు.

సంఘం ఉపాధ్యక్షుడు కడారి దేవన్న మాట్లాడుతూ.. పుస్తకంలోని అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. సామాజిక వర్గాల మధ్య ఉద్రిక్తతలకు దారితీసేలా ఉన్న విషయాలను ప్రచురించకుండా సంబంధిత సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జిల్లా కన్వీనర్ జన్ను సాయి ప్రసన్న మాట్లాడుతూ.. పుస్తకం విడుదలకు ముందే ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిశీలించాలని కోరారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంఘం ఉపాధ్యక్షుడు సింగారం పైలయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ భావజాలాన్ని కించపరిచేలా ఉన్న ఏ అంశాన్నీ సహించబోమని అన్నారు. పుస్తకంలోని వివాదాస్పద అంశాలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండల అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ మాట్లాడుతూ.. పుస్తకాన్ని విడుదల చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ అభిమానుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి ప్రచురణలు జరగకుండా ప్రభుత్వం పర్యవేక్షించాలని అన్నారు.

జన్ను రమేష్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను అభిమానించే ప్రజల మనోభావాలను గౌరవించాలని, వివాదాస్పద వ్యాఖ్యలు లేదా అంశాలు ఉంటే వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. పుస్తక విడుదలపై తక్షణమే ప్రభుత్వ స్థాయిలో సమీక్ష జరిపి, చట్టానికి విరుద్ధమైన అంశాలు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య సామరస్యాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం, సంబంధిత అధికారులు వ్యవహరించాలని కోరారు.

కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, అంబేద్కర్ అభిమానులు, శ్రీపెల్లి రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

# తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

## గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్: మాజీ ఎమ్మెల్యే సండ్ర

**సత్తుపల్లి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన నాలుగో వార్షికోత్సవం సందర్భంగా పెనుబల్లి మండలం సూర్యబంజర్ తండాలో కేసీఆర్ చిత్రపటానికి గ్రామస్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో 3,156 తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. తండాలు, గూడేల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించారని చెప్పారు. సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు హైదరాబాద్‌లో సేవాలాల్ భవన్ నిర్మించిన ఘనత కేసీఆర్‌కే



దక్కుతుందన్నారు. గిరిజన విద్యాభివృద్ధికి గురుకులాలను ఏర్పాటు చేశారని, గిరివికాస పథకం ద్వారా బోర్లు వేయించి బీడు భూములను సాగులోకి తెచ్చారని తెలిపారు. లక్ష మంది గిరిజన రైతులకు సుమారు నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సండ్ర ప్రశ్నలు సంధించారు. చేవెళ్ల డిక్లరేషన్, విద్యార్థులకు ఆర్థిక సాయం, ఐదు ఐటీడీఏలు, మూడు కార్పొరేషన్ల ఏర్పాటు వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 22ఏ భూముల అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్న హరీశ్‌రావు సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు చేయడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

కార్యక్రమంలో గిరిజన నాయకులు వంకోడత్ మురళి, వంకోడత్ రజిత, తేజావత్ తావునాయక్, మూడు వాసు, వంకోడత్ నాగేశ్వరరావు, బానోత్ శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, మాజీ జడ్పీటీసీ చక్కిలాల మోహన్‌రావు, నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వర్ధన్నపేటలోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ స్వాతంత్ర్యం, ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయులు, ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహనీయుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలోనూ జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మెట్టుగుట్ట దేవస్థానం చైర్మన్ పైడిపాల రఘుచందర్, సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దు సత్తన్న, మండల అధ్యక్షుడు పో వెంకన్న, టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా



**సత్తుపల్లి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి విరాట్‌నగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధ్యక్షుడు కోడూరి మోహనాచారి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మను దైవిక వాస్తుశిల్పిగా హిందూ పురాణాలు పేర్కొంటున్నాయని తెలిపారు. దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను రూపొందించడంతో పాటు ద్వారక, ఇంద్రప్రస్థ వంటి నిర్మాణాలతో విశ్వకర్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మ పూజ నిర్వహిస్తారని తెలిపారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మొగుడంపురం ఏడుకొండలు, ఆలయ అర్చకులు కుమాళ్ల రవి, రాంబాబు, రుద్రాక్షల అప్పాచారి, శ్రీహరి, భరత్, ప్రకాష్, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం2026 సందర్భంగా హసన్‌పర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మోహన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సుమన వాణి, ఏపీవో విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

**ఖమ్మం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** 2027 మార్చిలో ఖాళీ కానున్న మహబూబ్‌నగర్ రంగారెడ్డిహైదరాబాద్, వరంగల్‌ఖమ్మంనల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు కొత్త ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 28న ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రజా నోటీసు జారీ చేస్తారు. అక్టోబర్ 15, 25 తేదీల్లో పత్రికల్లో వరుసగా రెండు పునఃప్రచురణలు చేపడతారు. ఫారం–18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. డిసెంబర్ 25లోగా వాటి పరిష్కారం పూర్తి చేసి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ప్రస్తుత జాబితాలో పేరున్న గ్రాడ్యుయేట్లు సైతం కొత్తగా రూపొందించిన ఫారం–18లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దరఖాస్తుతోపాటు అవసరమైన ధ్రువపత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్ల ధ్రువీకరించిన ప్రతులను సమర్పించాలని సూచించింది.

# మండల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** వేములపల్లి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమ పథకాల ఫలాలు సమర్థవంతంగా అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. వేములపల్లి మండల కార్యాలయంలో గురువారం మండల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా పనుల పరిస్థితిని సమీక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి, మండల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పాలన సాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక విగ్రహానికి రూ.5,116 అందజేత



**దామరచర్ల/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి వినాయక విగ్రహానికి రూ. 5,116 చొప్పున అందజేస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఇచ్చిన హామీ మేరకు దామరచర్ల మండలం ఎర్నాం కాలనీలో ఏర్పాటు చేసిన బొజ్జ వినాయకుడి వద్ద గురువారం రూ. 5,116 అందజేశారు. చత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు బంటు కిరణ్, శ్యాంసుందర్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, దరగాని జనార్ధన్, సర్పంచ్ బంటు రేణుశ్రీ, మన్నెం నాగయ్య, పవన్ పూర్ణ, కొమ్ము రాజేష్ తదితరులు పాల్గొన్నారు.?

# బయ్యారం పంచాయతీలో నీటి తిప్పలకు శాశ్వత పరిష్కారం.!





**-ప్రజలకు అండగా సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.**

**బయ్యారం/,సెప్టెంబర్ 17.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యకు సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ శాశ్వత పరిష్కారం చూపారు. మిషన్ భగీరథ నీరు సరిగ్గా అందక ఇబ్బందులు పడుతున్న రంగాపురం గ్రామస్థుల కోసం పాలకవర్గం సహకారంతో అధికారులను ఒప్పించి గ్రామంలో రెండు బోర్లు వేయించారు. ఆ రెండు బోర్లు విజయవంతంగా పడటంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మరో రెండు మూడు రోజుల్లో పైప్‌లైన్, మోటార్ల ఏర్పాటు పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. గతంలో బయ్యారం ఉమ్మడి సర్పంచ్‌గా ఉన్నప్పుడు జగ్గుతండా (నల్లాలబావి),కట్టుగూడెం ప్రాంతాల్లో బావులు తవ్వించామని,అలాగే నా భర్త కిషన్ నాయక్ ఎంపీపీగా ఉన్న సమయంలో జాఫర్‌బాద్‌లో ప్రాంతంలో బావి తవ్వించి తాగునీటి ఇబ్బందులను తీర్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు 13 సంవత్సరాల తర్వాత మళ్లీ నీటి ఎద్దడి రావడంతో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టామన్నారు. ప్రజల మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని,బయ్యారం మండల ప్రజలకు ఏ కష్టం వచ్చినా తమ కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు భరోసా



**కేసముద్రం/సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) భరోసానిస్తుందని కేసముద్రం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. 11వ వార్డుకు చెందిన ఓర్సు సుజాతకు రూ. 15 వేలు, మహమ్మద్ మన్నాన్‌ఖాన్‌కు రూ. 16 వేలు, 1వ వార్డుకు చెందిన బానోత్ సునీతకు రూ. 24,500 చొప్పున చెక్కులు అందించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సాయం కొంత ఊరటనిస్తుందని డాక్టర్ అల్లం రమ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఆసుపత్రికి అధునాతన పరికరాలు

## రూ.67.41 లక్షల సీఎస్ఆర్ సాయం





**కొత్తగూడెం టౌన్/ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త);** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈసీఐఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో రూ. 67.41 లక్షల విలువైన ఆధునిక వైద్య, పరిశుభ్రత పరికరాలను ఆసుపత్రికి అందించింది. ఐసీయూ, నేత్ర, ఆర్థోపెడిక్ విభాగాలకు అవసరమైన పరికరాలతో పాటు స్క్రబ్బింగ్ మెషిన్, స్వీపర్, హైప్రెజర్ వాషర్ అందజేశారు. క్యాజువాలిటీని పరిశీలించిన కలెక్టర్ వైద్యం కోసం వేచి ఉన్న రోగి సమస్యను తెలుసుకుని అత్యవసర సేవల్లో జాప్యం చేయొద్దని సిబ్బందిని ఆదేశించారు. సీఎస్ఆర్ ద్వారా అందిన పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# ప్రజా పాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన తహసీల్దార్.



**బయ్యారం/,సెప్టెంబర్ 17.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తహసీల్దార్ చప్పిడి నాగరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జెండాకు వందనం సమర్పించి,జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ శాఖ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు,ఆర్ఐలు,సర్వేయర్, కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల వసతులను సద్వినియోగం చేసుకోవాలి

## -సర్పంచ్ ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/,సెప్టెంబర్ 17.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థులకు ఏకరూప దుస్తులు,బూట్లు,బెల్టులను కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ గురువారం చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని,విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,వార్డు మెంబర్, ప్రీ-ప్రైమరీ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎండ, వర్షం లెక్కచేయకుండా పట్టణ పరిశుభ్రతకు కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కమ్మం కృష్ణ, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు పాలాభిషేకం..

## తండాలో బీఆర్ఎస్ జెండా



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండాలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. 500కు పైగా ఓటర్లు ఉన్న తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పాటు కొత్త మండలాలు, జిల్లాల ఏర్పాటుకు కేసీఆర్ కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ గోపాలరావు, గుజ్జ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు గుజ వీరన్న, సిలువేరు కుమారస్వామి, తిరుపతి సురేష్, బానోతు నవీన్, సింగరమైన రాజశేఖర్, గ్రామ అధ్యక్షుడు భూక్య నాణ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య తిరుపతి, యువజన నాయకులు భూక్య రామ్మూర్తి, బొడ్డుపెల్లి శ్రీకాంత్, భూక్య మురళి, సీనియర్ నాయకులు తుమ్మల యాకయ్య, మాజీ సర్పంచ్ భూక్య మంగ్య, ఎరుకొండ వేణుగోపాల్‌రావు, పిట్టల రాజు, అంబటి ఏళ్లస్వామి, భూక్య గోపాల్, ఉప్పలయ్య, మంద ఏలీయా తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

## -'ఆశీర్వాద దీపం' వెలిగించిన తుమ్మల శ్రీనివాస్ రావు.



**బయ్యారం/,సెప్టెంబర్ 17.(జర్నలిస్ట్ వార్త)**
భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బయ్యారం మండల కేంద్రంలోని శివాలయంలో 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ కాలం పాటు ఆయురారోగ్యాలతో, శక్తివంతంగా దేశానికి సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఈ ఆశీర్వాద దీపాలను వెలిగించినట్లు తెలిపారు.దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతిని పెంచిన మహోన్నత నాయకుడు మోదీ అని కొనియాడారు.అదేవిధంగా కోటగడ్డ పంచాయతీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నంబూరి రామకృష్ణ, అడపు జై, డెరంగుల రాంబాబు, పిల్లల మల్లిఖార్జున్, రేఖ ఉప్పలయ్య,రాజేష్, స్థానిక బీజేపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హామీ అమలుకు కార్మికుల మెరుపు ధర్నా

## 21లోపు శానిటేషన్ కిట్లు ఇస్తాం కమిషనర్ సుజాత

**కొత్తగూడెం టౌన్/ సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):**
మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న శానిటేషన్ కిట్లు, దుస్తులు, నూనె, చెప్పులు, బూట్లు, గ్లౌజులు తదితర వస్తువులను వెంటనే అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో అడ్డా వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు.మూడేళ్లుగా శానిటేషన్ కిట్ తదితర వస్తువులు పెండింగ్‌లో ఉన్నాయని, గత ఆరు నెలలుగా అధికారులను కోరుతున్నా సమస్య పరిష్కారం కాలేదని రమేష్ పేర్కొన్నారు. సెప్టెంబరు 15లోపు కిట్లు ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చినా అమలు కాలేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.ధర్నా కొనసాగుతుండగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కమిషనర్ సుజాతతో ఫోన్‌లో మాట్లాడారు. కిట్లు అందించే విషయంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. దీంతో కమిషనర్ సుజాత ఫోన్‌లో మాట్లాడుతూ ఈ నెల 21లోపు శానిటేషన్ కిట్లను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు ధర్నాను విరమించారు.
హామీ అమలు కాకపోతే ఐక్యంగా ఉద్యమించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాతంగి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, ఎన్.రమేష్, నాగరాజు, వెంకటమ్మ, సుశీల, శ్రీను పాషా, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షల తేదీలు ప్రకటించిన బోర్డు

**హైదరాబాద్,సెప్టెంబర్17 (జర్నలిస్ట్ వార్త):**
పోలీసు ఉద్యోగాల భర్తీకి నిర్వహించే రాతపరీక్ష తేదీలను పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఎస్ఐ సివిల్ తత్సమాన పోస్టులకు నవంబర్ 29న, కానిస్టేబుల్ స్థాయి పోస్టులకు డిసెంబర్ 20న పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఏడాది జూలై 29న నాలుగు నోటిఫికేషన్లు జారీ చేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ముగిసిపోవడంతో పరీక్ష తేదీలను రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. ఎస్ఐ, ఏఎస్ఐ స్థాయి పోస్టులు 298, కానిస్టేబుల్ స్థాయి పోస్టులు 7,139 కాగా, ఇందులో ఐదువేల పోస్టులు పోలీసుశాఖకు సంబంధించినవే. గత నెల 19 నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. 4.29 లక్షల మంది అభ్యర్థులు 5,77,064 దరఖాస్తులు సమర్పించారని, ఒకే పోస్టుకు దరఖాస్తు చేసిన వారు 68.45శాతం కాగా, రెండు పోస్టులకు దరఖాస్తు చేసిన వారు 28.88శాతం ఉన్నారని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వివరించింది. మొత్తం దరఖాస్తుల్లో బీసీ అభ్యర్థులవి అత్యధికంగా 49.19శాతం ఉన్నాయని, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులవి 43.60శాతం ఉన్నాయని, ఓసీ అభ్యర్థులు 7.20శాతం, ఇతర రాష్ట్రాల వారు 3.45శాతం ఉన్నారని బోర్డు అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో మహిళలవి 1,46,220(25.33 శాతం) ఉన్నాయని, పురుషులవి 4,30,844 (74.66శాతం) అని, ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌ను ఇంకా 2.6శాతం మంది పూర్తి చేయలేదని, వారికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ పరీక్షలను తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని, కానిస్టేబుల్ పరీక్షలను పది ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు 15 నుంచి 18 కేంద్రాల్లో నిర్వహించే అవకాశం ఉందని వివరించారు.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు.. మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు

**యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల నుంచి మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు**

**రూ.2000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ విధింపుపై ఆందోళన**


**ఈ ఛార్జీలు తమ మార్జిన్లపై భారం మోపుతాయని డీలర్ల సంఘం ఆవేదన**

**డిజిటల్ మౌలిక వసతుల కోసమే ఎండీఆర్ అని వివరించిన పెట్రోలియం శాఖ**

**ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని తెలిపిన ఏఐపీడీఏ**



**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):**
పెట్రోల్ బంకుల్లో ఇంధనం అమ్మకాలపై యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై 'ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్' (ఏఐపీడీఏ) ప్రతినిధులు గురువారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు.
కొత్త యూపీఐ నిబంధనల ప్రకారం, పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ.2,000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ ఛార్జీ విధిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో జరిగే మొత్తం కొనుగోళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం లావాదేవీలు ఈ




పరిధిలోకి వస్తాయని డీలర్లు చెబుతున్నారు. పెట్రోల్ అమ్మకాలు నిర్దేశిత కమీషన్లపై ఆధారపడి జరుగుతాయని, ఈ అదనపు ఎండీఆర్ ఛార్జీల భారం తమ మార్జిన్లను దెబ్బతీస్తుందని డీలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.
ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అధికారులు ఎండీఆర్ విధింపు వెనుక ఉన్న కారణాలను వివరించారు. దేశంలో యూపీఐ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు ఈ ఛార్జీలు అవసరమని వారు తెలిపారు. మరోవైపు, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో తాము ముందు వరుసలో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేశామని ఏఐపీడీఏ గుర్తుచేసింది.
ఎండీఆర్ అనేది ప్రభుత్వం గానీ, ఎన్‌పీసీఐ గానీ వసూలు చేసే పన్ను కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు ఈ మొత్తాన్ని బ్యాంకులకు, పేమెంట్ అప్లికేషన్ ప్రొవైడర్లకు పంచుతారని తెలిపింది. ఇంధనం, రైల్వేలు, టెలికాం, బీమా, వ్యవసాయం వంటి తక్కువ మార్జిన్లు ఉండే కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఈ రూ.5 ఫ్లాట్ ఛార్జీని వర్తింపజేస్తున్నారు.
ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని, వినియోగదారులు, డీలర్లు, యూపీఐ భాగస్వాములు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని ఏఐపీడీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

## నేడు హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సు



**హైదరాబాద్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ వార్త):**
దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ, అనుబంధ రంగాల సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లో జరగనుంది. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఈ సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ప్రసంగించనున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారు.